క్లుప్తంగా

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ అనురాధ, ప్రజాప్రతినిధులు

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ అనురాధలతో ముద్రించిన ప్రజల కోసం క్యాలెండర్‌ని ఎంపీ చింతా అనురాధ మంగళవారం ఆవిష్కరించారు. మొగళ్లమూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమక్షంలో క్యాలెండర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. హార్టీకల్చర్ యూనివర్సిటీ బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, టీపీసీ మెంబర్ కుడుపూడి శ్రీను, డాక్టర్ చింతా వంశీధర్, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రాపాక విజయలక్ష్మి, సుందరనీడి సాయి, సాధనాల వెంకట సూర్య నాగమణి, రుద్రరాజు లక్ష్మీపతిరాజు, బర్రే సీతారత్నం, బొమ్మి బాలవేణి, ఎంపీటీసీలు జల్లి మరియమ్మ, రాజేశ్వరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మల్లాడి సేవా సంస్థ ప్రారంభం



మల్లాడి హనుమంతరావు సేవా సంస్థను ప్రారంభిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: నియోజకవర్గ మత్స్యకార నాయకుడు దివంగత మల్లాడి హనుమంతరావు పేరుతో సేవా సంస్థ ఏర్పాటైంది. స్థానిక హరి మనో వికాస దివ్యాంగుల పాఠశాలలో ఈ సంస్థను లయన్స్ వశిష్ట జోన్ చైర్‌పర్సన్ మాకిరెడ్డి పూర్ణిమ మంగళవారం ప్రారంభించారు. దివంగత హనుమంతరావు కుమార్తెలు అల్లవరం మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు చిప్పల యామిని, లంకే రేణుక ఈ సేవా సంస్థను, కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తూ చైర్మన్‌గా చిప్పల నరేష్‌కుమార్, వైస్ చైర్మన్‌గా కొప్పాడ రమేష్, కార్యదర్శిగా కోలా నరసింహమూర్తి, సభ్యులుగా పాలెపు గంగరాజు, కొప్పాడి శ్రీనివాస్, వాడ్రేవు లోవరాజు, ఓలేటి కామేశ్వరరావు, లంకే బాలకృష్ణ, పలచూర్ల వెంకటేశ్వరరావులను నియమించారు. అనంతరం కేక్ కట్ చేసి దివ్యాంగులకు పంచిపెట్టారు.

అభయాంజనేయునికి విశేష పూజలు

తాళ్లరేవు: చరిత్ర ప్రసిద్ధిగాంచిన చొల్లంగి అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు చేశారు. సంక్రాంతి సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముక్కనుమ పండుగతో పాటు మంగళవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా సమీపంలోని చంద్ర ప్రతిష్ఠిత లింగం రాజరాజేశ్వరి సమేత శ్రీ సోమేశ్వరస్వామి ఆలయాన్ని కూడా భక్తులు సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మాల మాస్టీలకు సత్కారం



మాల మాస్టీలను సత్కరించిన విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు

తాళ్లరేవు: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రదర్శన ఇచ్చిన మాల మాస్టీలను విశ్వజన కళామండలి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బుర పరిచే ప్రదర్శన ఇచ్చిన మాల మాస్టీ సభ్యులను కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు సత్కరించి అభినందనలు తెలిపారు. సంప్రదాయ బద్ధంగా సంక్రాంతిని జరుపుకోవడంలో వారు చేస్తున్న కృషి ఎనలేనిదని ఏడుకొండలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాబా నగర్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌కు నవోదయ ప్రాజెక్టు



దుర్గేశ్

యానాం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థి దుర్గేశ్ రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు ఈ నెల 27న అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ చిల్డ్రన్ కాంగ్రెస్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టీపీఎస్ ప్రకాశరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయలో 8వ తరగతి చదువుతున్న దుర్గేశ్ విద్యార్థుల శరీర సౌష్టవాన్ని బయట చదివే విద్యార్థుల బీఎంఐతో తులనాత్మకంగా పరిశీలించి చేసిన పరిశోధన జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైందన్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు అహ్మదాబాద్‌లో జరిగే సైన్స్ కాంగ్రెస్‌లో హైద్రాబాద్ రీజియన్ తరఫున దుర్గేశ్ హాజరుకాబోతున్నట్లు తెలిపారు. దుర్గేశ్‌తో పాటు సైన్స్ ఉపాధ్యాయుడు రాహుల్ ద్వివేదిని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

తీరం.. జనసంద్రం

- సందర్శకులతో కిటకిటలాడిన ఓడలరేవు, ఎస్.యానాం సాగర తీరాలు
- చిన్నా పెద్దా తేడా లేకుండా కేరింతలు

అల్లవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఓడలరేవు తీరం జన సంద్రమైంది. తీరం పొడవునా మంగళవారం సందర్శకులతో సాగరతీరం కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన యువతీ, యువకులు తీరంలో ఆటపాటలతో సందడి చేశారు. తీరమంతా ఉత్సవాన్ని తలపించింది. సముద్ర కెరటాలు ప్రశాంతగా ఉండి వాతావరణం ఆహ్లాదకర ఉండడంతో ఎక్కువ సమయాన్ని తీరంలో గడిపారు. పిల్లలైతే సముద్రంలో స్నానం చేయడానికి ఎంతో ఉత్సాహం చూపారు. సంక్రాంతి పండుగ అనంతరం ఓడలరేవు తీరానికి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది భారీ ఎత్తున పర్యాటకులు ఓడలరేవు సముద్ర తీరాన్ని సందర్శించారు.

యువకులకు దేహశుద్ధి

కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక ప్రాంతానికి చెందిన కొందరు యువకులు తీరానికి వచ్చిన మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో స్థానికులు వారికి దేహశుద్ధి చేసి అల్లవరం పోలీసులకు అప్పగించారు. అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో వారికి ఎస్సై శ్రీనునాయక్ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

ఎస్.యానాం తీరంలో సందడే సందడి..

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాం తీరంలో సందర్శకులు గాలిపటాలు ఎగరవేసి సందడిగా గడిపారు. సముద్ర కెరటాల్లో సందర్శకులు ఆటలాడి సందడి చేశారు. యువత కబడ్డీ, క్రికెట్ వంటి ఆటలు ఆడి, డీజేలతో మోత మోగించారు. ఉదయం నుంచి సరుగుడు తోటల్లో విందు ఆరగించారు.





ఓడలరేవు తీరానికి పోటెత్తిన సందర్శకులు. (అంతర చిత్రం) ఎస్.యానాం తీర ప్రాంతంలో పర్యాటకుల సందడి

మన్ను మింగేస్తున్నారు

- నిబంధనలు గాలికి వదలి తవ్వకాలు
- స్థలాల చదును పేరుతో ఇసుక తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, అటవీ అధికారులు

కాట్రేనికోన: తుపానులు, సునామీల వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తీరగ్రామాలను రక్షించే సముద్ర తీరం వెంబడి ఉన్న ఇసుక తిన్నెలను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. పల్లం పంచాయతీ బ్రహ్మ సమేధ్యం కాలభైరవస్వామి ఆలయం సమీపంలో నీళ్లరేవు నుంచి చిర్రయానం గ్రామానికి మధ్యలో సముద్ర తీరాన్ని తవ్వేస్తున్నారు. గత మూడేళ్ల కాలంలో అభివృద్ధి పనుల పేరుతో తీరం వెంబడి ఉన్న ఇసుక తరలించుకు పోతున్నారు. చిర్రయానం, నీళ్లరేవులలో ప్రభుత్వం పేదలకు ఇల్లు స్థలాలకు అవసరమైన లే అవుట్లు మెరక చేసేందుకు సముద్రపు ఇసుకను తరలించారు. పల్లం, కొత్తపాలెం, మొల్లేటిమొగ, చిర్రయానం, పోర గ్రామాల్లో ప్రభుత్వ భవనాల పునాదులలో వేసేందుకు సముద్రపు ఇసుకను తరలించారు. కందికుప్ప, దొంతికుర్రు, పల్లం, పల్లంకుర్రు, పరిసర ప్రాంతాలలో కొత్త ఇళ్ల పునాదులలో వేసేందుకు తీరం వెంబడి ఇసుకను తవ్వేస్తున్నారు. పల్లం పంచాయతీ బ్రహ్మసమేధ్యం కాలభైరవస్వామి ఆలయం నుంచి సముద్ర తీరం వరకు సీఎస్ఆర్ నిధులు రూ.75 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంజూరు చేశారు. సీసీ రోడ్డు లెవెలింగ్ పనులకు సరుగుడు చెట్లు అడుగున వేసి తీరం వెంబడి సముద్రపు ఇసుకను వేసి పనులు చేపట్టారు. అటవీ ప్రాంతాన్ని, తీరాన్ని రక్షించాల్సిన అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఈ ప్రాంతంలో ఏటా జరిగే చొల్లంగి తీర్థానికి వచ్చే భక్తులు ఇసుక తిన్నెలలో రాత్రి వేళ ఆటలాడుతూ సేద తీరేవారు. సముద్రం వెంబడి ఎత్తైన ఇసుక మేటలను అక్రమార్కులు తవ్వేయడంతో లోతైన పల్లపు ప్రాంతంగా మారి ఉప్పు నీటి గుంటలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పల్లం గ్రామానికి చెందిన శ్మశానం భూమి ఉంది. ఈ భూమి ఇసుకను సైతం చదును పనులకు వాడేస్తున్నారు.

సీఆర్‌జెడ్ నిబంధనలు గాలికి వదలి..

సముద్రం, నదీ తీరప్రాంతాల వెంబడి (సీఆర్‌జెడ్) పరిధిలోని గుప్పెడు ఇసుకను సైతం తవ్వకూడదనే సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా సదరు కాంట్రాక్టరు తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నాడు. రహదారి లెవెలింగ్ పనులకు అవసరమైన ఇసుకను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకునే వెసులుబాటు ఉన్నా సముద్రపు తీరం వెంబడి ఇసుకను సీసీ రోడ్డు లెవెలింగ్ పనులకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తీరాన్ని తవ్వేస్తున్నా సంబంధిత రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు పట్టించుకున్న పాపానికి పోవడం లేదు. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు మండి పడుతున్నారు. దీనిపై అటవీశాఖ డీఆర్వో పట్టాభిని వివరణ కోరగా సముద్రం వెంబడి ఇసుక తవ్వుతున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. సిబ్బందిని పంపించి పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.



బ్రహ్మసమేధ్యం కాలభైరవస్వామి ఆలయం సమీపంలో రోడ్డు చదును పనులకు వాడిన సముద్ర ఇసుక

వెంకటలక్ష్మికి రూ.40 వేల ఆర్థిక సాయం



వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సహాయం అందజేస్తున్న శివన్నారాయణ

సాక్షి ఇంపాక్ట్

తాళ్లరేవు: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ రాజమండ్రిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుడుపూడి వెంకటలక్ష్మిని దాతలు ఆదుకుంటున్నారు. ఈ నెల 15వ తేదీన సాక్షి దినపత్రికలో పెద్దమనసుతో ఆదుకోండి శీర్షికన ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించారు. రాజమండ్రి సమీపంలోని వేమగిరి వద్ద బంధువుల ఇంటివద్ద ఉంటూ రాజమండ్రి స్వతంత్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మికి మంగళవారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుడుపూడి శివన్నారాయణ రూ.25 వేలు, ఉప్పంగల కల్వరి ప్రార్థన మందిరం పాస్టర్ విమోచనరాజు రూ.7 వేలు, జగనన్న సేవాసమితి అధ్యక్షురాలు దడాల సువర్ణలత రూ.5 వేలు, ఆనాల భాస్కర్ రూ.2 వేలు, కాజా గోవిందు రూ.వెయ్యి అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాళ్లరేవు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు సబ్‌స్టేషన్ ఆధునీకరణలో భాగంగా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని తాళ్లరేవు, కోరంగి, సీతారామపురం, జార్జిపేట, నీలపల్లి, పోలేకుర్రు, గాడిమొగ, భైరవపాలెం తదితర పంచాయతీల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ప్రసాద్ కోరారు.

రేషన్ ఇప్పించి ఆదుకోరూ..

తాళ్లరేవు: తాను ముగ్గురు ఆడ పిల్లలతో ఉంటున్నానని తనకు రేషన్ బియ్యం తీసుకునే అవకాశం కల్పించాలని గుబ్బల మహేశ్వరి అనే మహిళ వేడుకొంటోంది. ఆమె తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు గ్రామానికి చెందిన తనకు కోటకొండ గ్రామానికి చెందిన గుబ్బల సూర్యనారాయణతో వివాహం అయ్యింది. ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత తనను వదిలివేసి వెళ్లిపోయాడు. తనతో పాటు రేషన్ కార్డును తీసుకువెళ్లిపోవడంతో బియ్యం తీసుకోలేకపోతున్నట్లు తెలిపింది. తన పిల్లలతో పాటు తన చెల్లెలు కుమార్తె కూడా తనవద్దే ఉంటోందని, కూలి, నాలి చేసుకుంటూ జీవిస్తున్న తనకు బియ్యం అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నానని, సచివాలయంలో ఒక స్లిప్ ఇచ్చారని దాంతో కూడా బియ్యం తీసుకోనివ్వకుండా సూర్యనారాయణ అడ్డుపడుతున్నాడని ఆరోపించింది. అధికారులు స్పందించి తనకు రేషన్ కార్డు ఇప్పించాలని కోరుతోంది.



చిన్నారులతో మహేశ్వరి

వైభవంగా వనువులమ్మ తల్లి తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అమలాపురం రూరల్: తాండవపల్లి పరిధి శెట్టిపల్లిలోని వనవులమ్మ తల్లి తీర్థం మంగళవారం నిర్వహించారు. అమ్మవారి పుట్టింటి వారు, అత్తింటివారు వనువులమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. ఎస్సై అందే పరదేశి బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీటీసీ కైరం సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాలను జరిపించారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

అల్లవరం: ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా బైర్రాజు ఫౌండేషన్, వెలుగు ఆధ్వర్యంలో నగదు రహిత లావాదేవీలపై మంగళవారం అవగాహన కల్పించారు. దేవగుప్తంలోని రామాలయంలో వద్ద ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. డ్వాక్రా సంఘాల పుస్తకాలను రాసుకోవడం, సమావేశాలు నిర్వహించి లాభనష్టాలపై చర్చించడం, రుణాలు తీసుకున్న వారి వివరాలు, రుణాలు చెల్లింపులు, రుణాల చెల్లింపులు పారదర్శకంగా నిర్వహించడంపై సమీక్షలు, బ్యాంక్ ఖాతాల్లో డ్వాక్రా సంఘాల లావాదేవీలపై సమీక్ష వంటి విషయాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఏటీఎం కార్డు వినియోగించే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



డిజిటల్ స్క్రీన్ ద్వారా ఆర్థిక లావాదేవీలపై శిక్షణ పొందుతున్న మహిళలు

అక్రమ మద్యం పట్టివేత

కాట్రేనికోన: యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న 96 మద్యం సీసాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు పల్లంకుర్రు గ్రామానికి చెందిన గెద్దాడ శ్రీనివాసరావు, బొంతు వెంకటేశ్వరరావు గ్లామర్ బైక్‌పై 96 మద్యం సీసాలను తరలిస్తుండగా పల్లంకుర్రు నుంచి బలుసు తిప్ప వెళ్లే రహదారిలో దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో కాపుకాసి చాకచక్యంగా పట్టుకున్నామన్నారు. అక్రమ మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మండల పరిధిలోని కందికుప్ప గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పేకాడుతున్నారనే సమాచారంతో టి.శ్రీనివాస్ తన సిబ్బందితో శిబిరంపై దాడి చేసి కేశనకుర్తి గౌరీశంకర్(పల్లంకుర్రు), గాలిదేవర శ్రీనివాస్ (కందికుప్ప)లను అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.21,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కాట్రేనికోన పోలీసులకు పట్టుబడ్డ అక్రమ మద్యం

వారి ఆత్మీయతకు 27 ఏళ్లు..

- పూర్వ విద్యార్థుల కలయిక
- నాటి సంతోషాలకు వేదికైన గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1994–95 విద్యార్థులు మంగళవారం స్థానిక పాఠశాలలో ఆత్మీయంగా సమావేశమయ్యారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. వారి గురువులైన కొమ్ముల సూర్యనారాయణ, మెండి సత్తిరాజు, ఆకుల నాగేశ్వరరావు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, అంబటి సత్యనారాయణ, నిమ్మకాయల నాయుడు లను ఘనంగా సత్కరించారు. వీరితో పాటు చదువుకుని వెనుకబడిన కొన్ని కుటుంబాలను ఆర్థికంగా చేయూతనిస్తున్నామని తెలిపారు. ఈ బ్యాచ్ తరపున గొల్లవిల్లి సీఎస్ఎం కళాశాలకు విద్యార్థుల చదువు నిమిత్తం కంప్యూటర్లను, ప్రొజెక్టర్‌ను అందించినట్టు వారు వివరించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారి గురువులతో నాటి పదో తరగతి విద్యార్థులు

27 ఏళ్ల కల ఫలించింది..



పాఠశాల వదిలి 27 ఏళ్లు అవుతున్నా నాటి జ్ఞాపకాలు మాలో పదిలంగా ఉన్నాయి. ఎన్నో ఏళ్ల నిరీక్షణ నేటికి ఫలించింది. నేను సీఎస్ఎం కళాశాలలో కంప్యూటర్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నా. స్నేహితుల సహకారంతో తమ కళాశాలలో బాగా చదువుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు మా బ్యాచ్ నుంచి అందిస్తున్నాం.

– కాట్రు పురుషోత్తం, పూర్వ విద్యార్థి

లక్ష్యం నెరవేరింది..



నేను జీవితంలో రెండు విషయాలు లక్ష్యంగా పెట్టుకున్నా. ఒకటి నాలైఫ్ గురించి, రెండవది మా స్నేహితులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయాలని. 2007 నుంచి మా స్నేహితుల వివరాల సేకరణ మొదలుపెట్టి రెండేళ్ల క్రితం పూర్తి చేశాను. ఇన్నేళ్లకు ఇలా కలవడం చాలా ఆనందంగా అనిపించింది.

– బద్రి వెంకటరమణ, పూర్వ విద్యార్థి

శిష్యులను చూసి గర్విస్తున్నా



నా దగ్గర చదువు నేర్చుకున్న శిష్యులు ఈ రోజు పలు రంగాల్లో అభివృద్ధి చెందినందుకు చాలా గర్విస్తున్నా. రాజకీయ, వ్యాపార, ఉద్యోగాల్లో మంచి స్థానంలో వారు ఉండడం చాలా సంతోషంగా ఉంది. వారిని కలుసుకోవడం, వారు చూపిన ఆప్యాయత మధురానుభూతి కలిగించాయి.

– కొమ్ముల వెంకట సూర్యనారాయణ, గణిత అధ్యాపకుడు, జిల్లా విద్యా శిక్షణ కేంద్రం, బొమ్మూరు

పాలగుమ్మిలో గురువులకు సత్కారం

అమలాపురం రూరల్: పాలగుమ్మి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలసి 1995– 96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను వారు సత్కరించారు. ఇన్నేళ్ల తరువాత తమ విద్యార్థులు రావడం చాలా ఆనందంగా ఉందని వారిని అభినందించారు. నాటి విద్యార్థులు మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదని, చదువులు చెప్పిన గురువులతో సమావేశం అవ్వడం చాలా ఆనందంగా ఉందని, వారి ఆశీస్సులతో తాము ఉన్నత స్థానంలో ఉన్నామని వారిపై గౌరవాన్ని చాటుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో ఫొటోలు దిగారు.



పాలగుమ్మిలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సస్యరక్షణతో కాండం తొలుచుపురుగు నివారణ

ముమ్మిడివరం: ప్రస్తుత రబీలో కాండం తొలుచు పురుగు వ్యాప్తి చెందుతోందని వాటి నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు సూచించారు. ముమ్మిడివరం మండలం కొమానపల్లి, గేదెల్లంకలో ఎంటీయూ 1121, 3636 వరి రకం సాగు చేసిన వరి చేలను మంగళవారం ఆయన పరిశీలించారు. సుమారు 30 రోజుల క్రితం ఊడ్చిన చేలలో కాండం తొలుచు పురుగు, దుబ్బుకుళ్లు తెగుళ్లు ఉండటాన్ని గమనించి నివారణకు తీసుకోవలసిన చర్యలను సూచించారు. జిల్లా సహాయ సంచాలకుడు రాజశేఖర్, ఎంఏఓ ప్రశాంతకుమార్ పాల్గొన్నారు.



కొమానపల్లిలో రబీ వరిచేలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తదితరులు

అంబరాన్నంటిన ప్రభల తీర్థం



అంబాజీపేట సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలు

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా ముక్కనుమ రోజున నిర్వహించే ప్రభల తీర్థం (చక్రతీర్థం) మంగళవారం ఘనంగా జరిగింది. మాచవరంలోని రామ్‌ఘాట్‌లోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను పురవీధుల్లో గౌడ యువసేన యువకులు అంబాజీపేట సెంటర్‌కు తీసుకురాగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తీర్థం ముగిసిన అనంతరం ప్రభలతో గ్రామోత్సం నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ప్రభలను దర్శించుకున్నారు.